ప్రజాశక్తి
సోమవారం 26 ఆగస్టు 2024
5
విజయనగరం



పరిశ్రమల్లో భద్రతపై 27న యాజమాన్యాలతో సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని భారీ పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో భద్రతపై ఈనెల 27న ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ తెలిపారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లోనూ భారీ పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని జిల్లాల్లోనూ జిల్లా కలెక్టర్, ఎస్‌పిల నేతృత్వంలో ఫ్యాక్టరీల యాజమాన్యాలతో, వాటి అధిపతులతో సమావేశాలు నిర్వహించి భద్రత చర్యలపై సమీక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ అధికారులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక, కార్మిక శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొంటారు.

నిర్వాసిత సమస్యలు పట్టని అధికారులు

- విమానాశ్రయ భూసేకరణలో మిగతా భూమికి సబ్‌డివిజన్ చేయని అధికారులు
- లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్‌కు నోచని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఇళ్లు
- రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం
- కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధం



నిర్వాసిత గ్రామం

ప్రజాశక్తి భోగాపురం

విమానాశ్రయం నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వీరితో పాటు నిర్వాసితుల సమస్యలను కూడా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. సొంత జిరాయితీ భూముల్లో కట్టుకున్న ఇళ్లను తొలగించి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్లను నిర్మించారు. కాని నిర్వాసితుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయలేదు. అత్యవసరానికి ఇంటిపైన రుణాలు తీసుకునే అవకాశం లేకుండా చేశారు. అలాగే భూముల వ్యవహారంలో కొంత భూమి విమానాశ్రయానికి పోగా మిగతా భూమిని సంబంధిత రైతుల పేరుమీద రెవెన్యూ అధికారులే సబ్ డివిజన్ చేయాలి. అలా చేయకపోవడంతో ఆ భూముల మీద రుణాలు తీసుకుందామన్న అత్యవసర సమయంలో అమ్ముకుందామన్న కుదరడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కొంత మంది సభ్యులు ఈ సమస్యలపై ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు కొంతమంది సిద్ధమవుతున్నారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో బైరెడ్డిపాలెం పంచాయతీ ముడసలపేట, గూడెపువలస పంచాయితీ రెల్లిపేట, దల్లిపేట పంచాయితీ బొల్లింకలపాలెం, కౌవులవాడ పంచాయితీ మరడపాలెం గ్రామాలను తొలగించాల్సి వచ్చింది. వీరు ఆయా గ్రామాల్లోని తాత తండ్రులు నుంచి వస్తున్న సొంత జిరాయితీ భూముల్లో ఇళ్లను నిర్మించుకొని జీవనం సాగించేవారు. దీనికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ఉండేవి. వీటితో అత్యవసర పరిస్థితుల్లో అవసరమైతే ఆ ఇళ్ల డాక్యుమెంట్లను తాకట్టు పెట్టి బ్యాంకుల్లో లేదా గ్రామాల్లో తెలిసిన వారి వద్ద అప్పుతెచ్చుకునే వారు. కాని విమానాశ్రయం నిర్మాణంలో ఈ గ్రామాలను తొలగించి పోలిపల్లి, గూడెపువలస రెవెన్యూ గ్రామాల పరిధిలోని డి-పట్టా భూములను కొనుగోలు చేసి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు నిర్మించి వీరికి ఇచ్చారు. గూడెపువలస సమీపంలో బొల్లింకలపాలెం, రెల్లిపేట, పోలిపల్లి వద్ద కొండపైన మరడపాలెం, ముడసలపేట కాలనీలు స్థలాలు ఇచ్చి నిర్మాణానికి అవసరమైన సొమ్ము ఇచ్చారు. అక్కడ జిరాయితీ భూమిలో నిర్మించుకున్న ఇళ్లు కోల్పోయినప్పుడు మాకు ఇక్కడ ఇచ్చిన ఇంటి స్థలాన్ని మాపేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని వీరంతా కోరుతున్నారు. కానీ వీరికి ఇచ్చింది డి-పట్టా భూమి కావడంతో దానిని 22ఎలో నుంచి డీ నోటిఫికేషన్ చేయాలి. కాని అలా చేయకుండా ప్రభుత్వం తమతో ఆడుకుంటోందని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.

రైతుల పేరు మీద సబ్‌డివిజన్ చేయకుండా వదిలేశారు

విమానాశ్రయం నిర్మాణం కోసం 2700 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. ఒక రైతుకు ఉన్న సర్వే నెంబరులోని ఎకరా భూమిలో అర ఎకరాను విమానాశ్రయం కోసం తీసుకున్నారు. మిగతా అర ఎకరాను సంబంధిత రైతు పేరుమీద ఆన్‌లైన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులకు ఉంది. కానీ అలా చేయడం లేదు. ఆ అర ఎకరా కూడా విమానాశ్రయం పేరు మీదే ఆన్‌లైన్‌లో చూపుతుంది. దీంతో సంబంధిత రైతులు రెవెన్యూ కార్యాలయంతో పాటు అధికారులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాని ఏయే రైతులు భూములు ఇలా పోయావో గుర్తించి నేరుగా వారి పేరు మీద ఆన్‌లైన్ చేయకుండా వారిని అధికారులు తిప్పడం దారుణం. గూడెపువలస, కౌలువాడ, కంచేరు, ఏరావివలస, సవరవల్లి గ్రామాలో చాలా మంది ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లో విమానాశ్రయం పేరు మీద ఉన్నాయి



గ్రామాల్లో చాలా మంది రైతులు విమానాశ్రయం నిర్మాణం కోసం భూములు ఇచ్చారు. అందులో కొంత భూమి పోయినప్పుడు మిగతా భూమి సంబంధిత రైతుల పేరుమీద సబ్‌డివిజన్ చేయాలి. కానీ రెవెన్యూ అధికారులు అలా చేయడం లేదు. తాము వెళ్లి వారిని చేయమని బతిమాలాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

ఉప్పాడ శివారెడ్డి, ఎ.రావివలస సర్పంచ్

ఇళ్లను మా పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి



విమానాశ్రయ నిర్మాణంలో జిరాయితీ భూమిలో ఇళ్లను చాలా మంది కోల్పోయారు. డి-పట్టా భూముల్లో కాలనీలు ఇవ్వడంతో నిర్మించుకున్నారు. కాని వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం లేదు. దీనితో అత్యవసర సమయంలో ఇంటి మీద అప్పుకూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇళ్లను లబ్దిదారుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి.

కోరాడ పద్మ, ఎంపిటిసి, కవులవాడ

5వేల మందికి సుస్థిర జీవనోపాధి

- మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం
- రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి
- స్వయంశక్తి మహిళలకు రూ.68.55 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేత



స్వయంశక్తి సంఘాలకు చెక్కును అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, జెడ్‌పి చైర్మన్, కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గ్రామాల్లో వున్న మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాయని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో 1.22 లక్షల మంది స్వయంశక్తి మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని ఈ ఏడాది లక్ష్యంగా నిర్ణయించామని, అందులో మన జిల్లా నుంచి వంద రోజుల్లో 5 వేల మందిని లక్షాధికారులుగా రూపొందిస్తామని తెలిపారు. వారికి ప్రత్యేకమైన నిధులు ఇస్తూ జీవనోపాధికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. జిల్లా నుంచి 83,291మందిని లక్షాధికారులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి మహారాష్ట్రలోని జల్‌గావ్ నుంచి దేశంలోని అన్ని జిల్లాల మహిళా సమాఖ్యలతో ఆదివారం నిర్వహించిన లఖ్ పతి దీదీ ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్థానిక డిఆర్‌డిఎ సమావేశ మందిరం నుంచి జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జిల్లాలోని మహిళా స్వయంశక్తి సభ్యులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ స్వయంశక్తి సంఘాల మహిళలకు సుస్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆదాయం పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే 843 మహిళా సంఘాలకు వివిధ రకాల జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు, యూనిట్ల స్థాపనకు రూ.68.55 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని ఆరు ఆదర్శ మండలాలకు రూ.10 లక్షల వంతున రూ.60 లక్షల కమ్యూనిటీ పెట్టుబడి నిధిని, స్త్రీనిధి కింద 10,248 మందికి రూ.77.40 కోట్ల రుణాలను అందజేశామని చెప్పారు. మహిళల్ని లక్షాధికారులుగా తీర్చిదిద్దడంలో భాగంగా 1,022 మంది సిఆర్‌పిలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 843 స్వయంశక్తి మహిళా సంఘాలకు రూ.68.50 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేస్తూ అందుకు సంబంధించిన చెక్కును జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో కలసి అందజేశారు. సిఆర్‌పిలకు సర్టిఫికెట్లను బహూకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో మహిళకు నెలకు కనీసం రూ.10 వేల ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా వారితో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో జీవనోపాధి కార్యక్రమాలను చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఎపిడి సావిత్రి, ఎల్‌డిఎం రమణమూర్తి, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు 500 మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జీస్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 500 మంది హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, భీమిలి ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌరీశంకర్ ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చేనెల 14 ,15, 16 తేదీల్లో గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని అని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆర్గ నైజింగ్ కార్యదర్శి లీలా కృష్ణ తెలిపారు. ఎంపికలకు రిఫరీలుగా వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్ కిషోర్, తవిటి నాయుడు, గురు నాయుడు, బాబ్జి, రామకృష్ణ, వర్మ వ్యవహరించారు.



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

పైడితల్లమ్మను దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదివారం పైడితల్లి అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అభివద్ధి పనులపై ఆలయ ఇఒ డివివి ప్రసాద రావు వివరించారు. ఈ సందర్భంగా అమ్మవారి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని దేవాదాయ కమిషనర్ కు బహుకరించారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ జిల్లా పరిషత్ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తో సమావేశమై అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు. జిల్లా యంత్రాంగం ద్వారా ఉత్సవాల నిర్వహణ కోసం చేయనున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. దేవాదాయ శాఖ నుంచి అందించాల్సిన సహకారంపై తెలిపారు. జిల్లాలో దేవాదాయ భూముల పరిస్థితిపై కలెక్టర్ చర్చించారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, విశాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష, ఉప కార్యనిర్వాహక

ఆటలు ఐక్యతకు నిదర్శనం

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రాజాం

క్రీడలు ఐక్యతకు నిదర్శనమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక జిసిఎస్ఆర్ కాలేజి గ్రౌండ్‌లో రాజాం నియోజకవర్గం పరిధిలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, చెస్ మొదలు ఆటలతో పాటు ఏకపాత్రాభినయం, పాటలు, పద్యాలు, కవితలు మొదలగు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రికెట్‌లో నాలుగు మండలాల నుంచి ఆరు టీములు పాల్గొనగా వంగర మండల యుటిఎఫ్ ఉపాధ్యాయుల టీము విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉపాధ్యాయుల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలిచిన వారు సెప్టెంబర్‌లో జిల్లాస్థాయి, అక్టోబర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డిసెంబర్ 14,15,16,17 తేదీలలో రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యుపిఎస్ పెన్షన్ స్కీం మరో జిపిఎస్ తప్ప ఒపిఎస్‌కు ప్రత్యామ్నాయం కాదని అన్నారు. కంట్రిబ్యూషన్ లేని విధానాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించుకోకుండా బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహన్‌రావు, ఎస్.కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌చంద్ర పట్నాయక్, జెవివిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శులు పక్కి వాసు, బి.రామునాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ చుక్క వైకుంతరావు, జిల్లా ఆడిట్ అధ్యక్ష కార్యదర్శులు గిరిడ చంద్రశేఖర్ నాయుడు, గేదెల రమేష్, నాలుగు మండలాల అధ్యక్షులు ఎం. రమేష్, బి.నాగేశ్వరరావు, డోల కృష్ణారావు, ఎం.ప్రసాద్, జి.విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు



బొబ్బిలిలో టగ్‌ఆఫ్‌వార్ ఆడుతున్న మహిళా టీచర్లు

మహిళా టీచర్ల క్రీడోత్సవం

బొబ్బిలిరూరల్ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళా టీచర్ల క్రీడోత్సవాలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయగౌరి విద్యారంగ పరిణామాలు, స్వర్ణోత్సవ సంబరాల ప్రాధాన్యత గురించి మాట్లాడారు. బొబ్బిలి మండల సహాధ్యక్షులు పి.కస్తూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్, గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు ఎస్.వి.రమణ మూర్తి,లెక్చరర్ శాంతి ,సామాజిక కార్యకర్త కృష్ణదాస్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు .

మండల సిఫార్సుల అమలుకు కుల గణనే కీలకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మండల సిఫార్సుల అమలుకు కుల గణనే కీలకమని బిసి సంఘాల జెఎసి నాయకులు గొలగాన రమేష్, కెల్ల శ్రీనివాసరావు, గొర్లె సూరిబాబు అన్నారు. ఆదివారంకలెక్టరేట్ వద్ద బిపి మండల్ 107 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిసి ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు గా ముసిరాన హరికి నియామక పత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఒబిసిలకు గుర్తింపు తెచ్చిన బలహీన వర్గాల నేత మండల్ అని అన్నారు. జిల్లా కేంద్రంలో బిసి సంఘ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించాలన్నారు. దేశంలోని అన్ని ఒబిసి కులాలకు, ఉప కులాలకు సంపూర్ణ సామాజిక న్యాయం అందాలంటే, ఒబిసిల వర్గీకరణ జరగాలన్నారు. బిపి మండల్ జయంతి సందర్భంగానైనా జన గణనను జాతీయస్థాయిలో నిర్వహిస్తామంటున్న కేంద్రం, కుల గణనను కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిలి నాగభూషణం, కొండ్రు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా యువజన అధ్యక్షులు బొబ్బాది చంద్ర నాయుడు, బిసి ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు ముసిరాన హరి, ఆర్.కళ్యాణ్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి : ఎపిటిఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జీవో 117ను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ బుకారి బాబు అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవి కుమార్ ,శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్ మోహనరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు బంకురు జోగి నాయుడు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేసిన రఘువర్మను మళ్లీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవికి అభ్యర్థిగా నిలబెట్టాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి మాట్లాడుతూ పాఠశాల ఉనికికే ప్రశ్నార్ధకంగా మారి ఉపాధ్యాయులు మోయలేని పని భారాన్ని కల్పిస్తున్న 117, 128 జీవోలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. గౌరవ అధ్యక్షులు జోగినాయుడు మాట్లాడుతూ సిబిఎస్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, తెలుగు మరియు ఇంగ్లీష్ రెండు మీడియంలను కొనసాగించాలని కోరారు. పదోన్నతులు కల్పించిన తర్వాత మాత్రమే పని సర్దుబాటును చేయాలన్నారు. సమావేశంలో పరిశీలకులు రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అవగాహన శిబిరాలు

11 మండలాల్లోని 53 గ్రామాల్లో నిర్వహణకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆదిమ గిరిజన తెగల అభివృద్ధికి ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పి.ఎం.జన్‌మన్) కార్యక్రమంలో భాగంగా అర్హులైన ఆదివాసీ గిరిజన తెగలకు కేంద్ర పథకాలను అందించేందుకు ఆదివారం గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో 11 మండలాల్లో 53 గ్రామాల్లో ఆదిమ తెగలకు సంబంధించిన గిరిజనులు నివసిస్తున్నట్టు గుర్తించినట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మండల, గ్రామస్థాయి అధికారుల నేతృత్వంలో ఈనెల 25 నుంచి అవగాహన శిబిరాలు నిర్వహించి పథకాలకు అర్హులైన గిరిజన లబ్దిదారుల గుర్తింపు, అవసరమైన ఆరు రకాల గుర్తింపుకార్డులను అందించడం, ధ్రువపత్రాల జారీ జరుగుతుందన్నారు. ఈ శిబిరాల ద్వారా ఆధార్ కార్డులు లేని వారికి వాటిని జారీచేయడం, పి.ఎం.జన్‌ధన్ కింద బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీకి పేర్లు నమోదు, గిరిజనులకు కుల ధ్రువపత్రాలు జారీ, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తుల గుర్తింపు, అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు జారీ వంటి ఆరు కార్యక్రమాలను అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి అందించేలా చర్యలు చేపడతారని పేర్కొన్నారు. వీటితోపాటు గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు, మహిళలకు ప్రసూతి ప్రోత్సహకాల మంజూరు, కిసాన్ క్రెడిట్ కార్డుల జారీ, కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రయోజనాలు కల్పించడం వంటి కార్యక్రమాలను కూడా మండల, గ్రామస్థాయి బందాలు చేపడతాయని తెలిపారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రోడ్ల నిర్మాణం, గృహ నిర్మాణం, కమ్యూనికేషన్ సౌకర్యాల కల్పన తదితర 11 రకాల వసతులను కేంద్ర పథకాల అనుసంధానం ద్వారా కల్పించేందుకు ఆయా శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. పిఎం జన్ మన్ కార్యక్రమం అమలుకు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామానందంను నియమించారు.

కుమార్తెను చూసేందుకు వెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం
- ఉప్పర నాయుడువలసలో విషాదం



లారీ ఢీకొని మృతి చెందిన తండ్రీకుమారుడు రామకృష్ణ, సాయికిరణ్

ప్రజాశక్తి-రేగిడి

కళాశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో ఉంటున్న కుమార్తెను చూసేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందిన ఘటన ఆదివారం రణస్థలం వద్ద చోటు చేసుకుంది. కుమార్తెకు బాగా చదువుకోవాలని విద్యాబుద్ధులు చెప్పి ఇంటికి తిరుగుముఖం పట్టిన వారిద్దరినీ అంతలోనే లారీ మృత్యువు రూపంలో కబళించింది. దీంతో రేగిడి మండలం ఉప్పరనాయుడువలసలో విషాదం అలముకుంది.

గ్రామానికి చెందిన కరణం రామకృష్ణకు భార్య రత్నకుమారి, కుమార్తె సాత్విక, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. రామకృష్ణ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కష్టమైనా ఇద్దరి పిల్లలనూ బాగా చదివించాలనే ఉద్దేశంతో అప్పులు చేసి ప్రైవేటు కళాశాలల్లో చదివిస్తున్నాడు. కుమార్తె భోగాపురం వద్ద హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో చదువు కుంటోంది. కుమారుడు విశాఖలో డిగ్రీ చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం కుమారుడు సాయికిరణ్ ఇంటికి వచ్చాడు. ఆదివారం కావడంతో తండ్రితో కలిసి చెల్లెను చూసేందుకుయ ద్విచక్ర వాహనంపై భోగాపురం వెళ్లారు. సాత్వికను కలిసి బాగా చదువుకోవాలని చెప్పి ఇంటికి తిరుగు పయనమయ్యారు. రణస్థలం మండలం బంటుపల్లి జంక్షన్ బీరు ఫ్యాక్టరీ వద్ద లారీ బైక్‌ను ఢీకొనడంతో తండ్రి కరణం రామకష్ణ (52), కుమారుడు సాయికిరణ్ (21) దుర్మరణం చెందారు. స్థానికులు ప్రమాద స్థలం వద్దకు చేరుకొని రామకష్ణ జేబులో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా అడ్రస్సు కనుక్కొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నంలో డిగ్రీ చదువుతున్న రామకష్ణ కుమారుడు సాయి కిరణ్ రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. చెల్లిని చూసేందుకు వెళ్లి వద్దామని తండ్రి, కుమారుడు శనివారం రాత్రి అనుకున్నారు.. ఆదివారం భోగాపురం వెళ్లి బాగా చదువుకోవాలని కుమార్తె సాత్వికకు చెప్పి తిరుగు ముఖం పట్టారు. ఇంతలోనే లారీ రూపంలో మృత్యువు వారిని బలితీసు కొంది. మృత దేహాలను శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం పోలీసులు తరలించారు. భర్త కుమారుడు మృతి రత్నకుమారి కన్నీరుమున్నీరైంది. రణస్థలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులకు పరిశ్రమ గురించి వివరిస్తున్న నీరజ్‌కుమార్

సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞాన అభివృద్ధికి సాంకేతిక నైపుణ్యాన్ని కూడా పెంచేందుకు కృషి చేయాలని కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రావాడ భాస్కరరావు అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు ఇండస్ట్రియల్ టూర్ కోసం బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఉన్న బెర్రీ ఎల్లోయిస్ ఇండస్ట్రీ ఆదివారం విద్యార్థులను తీసుకొచ్చారు. వీరికి నీరజ్ కుమార్ సందాన కర్తగా వ్యవహరించి విద్యార్థులందరికీ ఆ కంపెనీలో జరుగుతున్న పెల్లో మగ్గిస్ తయారీ గురించి పూర్తిగా వివరించారు. ఇటువంటి విజిట్స్ వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి, టెక్నికల్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగపడతాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వీరికి సహాయకారులుగా పాఠశాల ఉపాధ్యాయులు షేక్ షరీఫ్, బొత్స రత్న కిశోర్‌లు వచ్చి అన్ని వసతులు అందజేశారు.


గ్రామం ముందు జెసిబితో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న యువత

గ్రామాభివృద్ధే ధ్యేయంగా యువత

ప్రజాశక్తి - బాడంగి

గ్రామాభివద్ధి ధ్యేయంగా వాడాడ యువత పనిచేస్తున్నారు. ఇటీవలే గ్రామంలో ఉన్న యువతంతా కలిసి పెద్దల ప్రోత్సాహంతో గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అనుకున్నారు. వీధిలో, పాఠశాల, పొలాలకు వెళ్లే దారిలో చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తీసి రోడ్డు పక్కల పరిశుభ్రం చేసి చూపించారు. గ్రామం అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మండల, గ్రామ పెద్దలు వాడాడ యువతని అభినందిస్తున్నారు.



విఓఎలకు లక్‌పతి దీదీ సర్టిఫికేట్లు అందిస్తున్న ఎపిఎం

ఆర్థిక సాధికారతకే 'లక్‌పతి దీదీ'

ప్రజాశక్తి - మెంటాడ

స్వయం సహాయక (డ్వాక్రా) మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకే కేంద్ర ప్రభుత్వం లక్‌పతి దీదీ పథకాన్ని ప్రారంభించిందని వెలుగు ఎపిఎం తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం మహిళలను లక్షాధికారులు చేసే లక్ష్యంగా ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ గ్రామాల్లో చాలా మంది మహిళలు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందినవారున్నారని, ఇది ఆర్థికంగా స్వతంత్రంగా మారాలనుకునే మహిళలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పథకం మహిళలు తమ వ్యాపారాలను ప్రారంభించడానికి, ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడానికి సహాయపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఐదుగురు విఓఎలను లక్‌పతి దీదీ సర్టిఫికేట్లతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీలు అప్పలరాజు, వెంకట్రావు, సత్యం, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని దుక్క రాధాకృష్ణ(18) మృతి చెందిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. ఇది హత్య, ఆత్మహత్య అనేదానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక పోలీసులకు మృతుడు తండ్రి దుక్క అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తవలస సి.ఐ.షణ్ముఖరావు, ఎస్ఐ సుదర్శన్ విచారణ చేపడుతున్నారు. కంటకాపల్లి పంచాయతీ శివారు అంబేద్కర్ కాలనికి చెందిన దుక్క అప్పలరాజు, అరుణ పెద్ద కుమారుడు దుక్క రాధాకృష్ణ లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదిన ఇల్లు విడిచి వెళ్లాడని, కానీ ఎక్కడికి వెళ్ళాడో చెప్పలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే ఆదివారం తెల్లవారు బహిర్భూమికి వెళ్లిన మృతుని తమ్ముడు దుర్గాప్రసాద్, తండ్రి అప్పలరాజుకు మామిడి తోటలో రాధాకృష్ణ మృతదేహం చెట్టుకు వేలాడుతూ, తల చెట్టుకు, మొండెం కింద పడి ఉండటం చూసి నిర్ఘాంతపోయారు. మృతుపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తలకు తాడు ఉన్నప్పటికీ తల, మొండెం వేరు కావడంతో ఇది హత్య, ఆత్మహత్య అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గజపతినగరం

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం బంగారమ్మ పేట గ్రామానికి చెందిన కాళ్ల రాములు (75) గజపతినగరం నుండి శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో బంగారంపేట వైపు నడిచి వెళుతుండగా మధుపాడ వద్ద పాలకేంద్రం సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు యువకులు అరెస్ట్

ప్రజాశక్తి - డెంకాడ

గంజాయి తాగేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ సన్యాసినాయుడు ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో విజయనగరంకు చెందిన ముగ్గురు యువకులు గంజాయి సేవించేందుకు గునుపూరుపేట మీదగా వెళ్తున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆ ముగ్గురు యువకులను పట్టుకొని వారి వద్ద నుంచి సుమారు 300 గ్రాములు గంజాయి, రెండు మోటార్ సైకిల్, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మండలంలో స్టూడెంట్స్ గాని ఇతర ఎలాంటి వ్యక్తులైన గంజాయి మత్తు పదార్థాలు రవాణా వంటివి చేసిన స్టోరేజ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బెయిల్ రాని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత, స్టూడెంట్స్ గంజాయి నిషేధిత మత్తు పదార్థాలకు బానిస అయిపోయి జీవితాన్ని నాశనం చేసుకోకూడదని ఆయన తెలిపారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. కోటిపల్లి సుజాత (28)కి బొబ్బిలి మండలం ముత్తాడవలస గ్రామానికి చెందిన కోటిపల్లి ప్రసాద్‌తో వివాహం జరిగింది. ఇటీవల అత్తవారు ఇంటి నుంచి కన్నవారి ఇంటికి వచ్చి ఈ నెల 19న తిరిగి అత్త వారింటికి వెళ్లేందుకు స్థానిక బస్టాండ్ నుంచి వెళ్లిన ఈమె అత్త వారింటికి చేరినట్లు తల్లికి ఫోన్ చేసి చెప్పింది. ఈ నెల 23న తల్లి తిరిగి ఫోన్ చేయగా అత్తవారింటి వద్ద లేనట్లు తెలియడంతో ఆమె చుట్టాల ఇళ్లల్లో వాకబు చేసి ఆచూకీ లభ్యం కాక పోవడంతో శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమాల లెక్క తీయరేం?

● ఎన్నికల ప్రచారంలో కబ్జాల దందా బయట పెడతామన్న నాయకులు ● ఇప్పుడు మౌనం స్వలాభపేక్షకేనా? ● అక్రమాల వెనుక రెవెన్యూ అధికారుల హస్తమెంత?

ప్రజాశక్తి - శృంగవరపుకోట

గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టుంది నియోజకవర్గంలోని రాజకీయ నాయకుల వ్యవహారం. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున భూములు పెద్దల చేతుల్లో ఉన్నాయని ముఖ్యంగా వైసిపి నాయకుల భూ కబ్జాలను, దందాలను బయటపెట్టి కబ్జా చేసిన భూములకు మోక్షం కలిగిస్తానని గత ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజు శపథం చేశారు. వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న కడుబండి శ్రీనివాసరావు నియోజకవర్గంలో వందల ఎకరాలు భూమి లను కబ్జా చేశారని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎస్ కోటలో నిర్వహించిన టిడిపి సభలో నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి సిసోడియా చంద్రబాబునాయుడు నోటి తోనే చెప్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు అందజేసి కబ్జాల దందాను బయటపెడతామని చర్చ సాగుతోంది. ఇందులో భాగంగానే డి పట్టా భూములను రిజిస్ట్రేషన్ చేసి అక్రమానికి పాల్పడిన సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారని చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వంలో వైసిపి నాయకులు


వేపాడ మండలంలో కబ్జాకు గురైన డి-పట్టా భూములు

రాష్ట్రవ్యాప్తంగా ఫ్రీ హోల్డ్ భూములను, అసైన్డ్ భూములను అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక అధికారి సిసోడియా పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. గత పాలకులకు సహకరించారని ఆరోపణలతో సబ్ రిజిస్ట్రార్‌ని కూడా సస్పెండ్ చేశారు. కానీ రెండు పార్టీల స్థానిక నాయకులు వైసిపి ఆక్రమణలపై లెక్క తేలుస్తామని శపథం చేసి సంవత్సరం కావస్తున్నా, ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్నా అక్రమాల లెక్కలను తేల్చకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూ దందాల్లో ఆరోపణలు చేసిన వారికి కూడా వాటా ఉందన్న అనుమానం కలుగుతోందని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

కబ్జాల దందాలు బయటపెట్టాలి

రాష్ట్రంలో వైసిపి, టిడిపిలు ఒక తానులో గుడ్డలే. రెండు పులులు ఎదురెదురైతే గాండ్రించుకుంటాయి తప్ప ఒకదానిని ఒకటి గాయపరుచుకోవు అన్నట్లుగా వీరు వారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటారు. ఇది తెర బయట బాగోతం తెర వెనుక ఒకరు వ్యాపారాలు ఒకరు ఒకరు ఆక్రమణలకు మరొకరు సహకారం చేసుకుంటూనే ఉంటారు. ఈ నాయకులకు నియోజకవర్గ ప్రజలపై నిజంగా సేవ చేయాలనే భావన ఉంటే నియోజకవర్గంలో జరిగిన భూకబ్జాల దందాలను ఇరు పార్టీల నాయకులు బయటపెట్టి భూ ఆక్రమణలకు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

మద్దిల రమణ, సిపిఎం మండల కార్యదర్శి, ఎస్‌కోట

అధ్వానం.. బాలికల వసతి గృహం

●తాగునీరు లేదు.. దోమలకు మందూ లేదు..● నాచుపట్టిన మరుగుదొడ్లతో అవస్థలు ● పట్టించుకోని వసతి గృహ సంక్షేమాధికారి

ప్రజాశక్తి - రాజాం

పట్టణంలో గల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహం అధ్వానంగా తయారైంది. వసతి గృహంలో పిచ్చిమొక్కలతో పాటు, చెత్తపేరుకు పోవడంతో విద్యార్థినిలు దుర్వాసనతో సతమతమవుతున్నారు. వసతి గృహ సంక్షేమాధికారి పట్టించుకోకపోవడంతో ఈ ఇబ్బంది ఎదురువుతోందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో ఆహార మెనూ అమలవుతున్నా మౌలిక సదుపాయాలు అమలు కావడంలేదని విద్యార్థినిలు తెలిపారు. వసతి గృహంలో చెత్త, కలుపు మొక్కలు పేరుకుపోవడంతో విష సర్పాలు వస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు. కనీసం నెలకు ఒకసారైన డిడి, ఎఎస్‌డబ్ల్యుఒ, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షణకు రావటంలేదని చెబుతున్నారు. కాగా నిత్యం దోమలతో సావాసం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. వసతి గృహ కిటికిలకు కనీసం దోమ తెరలు కూడా లేకపోవడం, నెలకు ఒకసారైనా దోమల స్ప్రే కొట్టే పరిస్థితి కనిపించకపోవడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. వసతి గృహ పరిస్థితి చూస్తే విద్యార్థినులు విషజ్వరాలు, సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఎక్కువగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.


వసతి గృహంలో కుప్పలుగా ఉన్న చెత్త (వృత్తంలో)

మరుగుదొడ్లదీ అదే పరిస్థితి

వసతి గృహానికి సంబంధించిన మరుగుదొడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. నాచుపట్టి అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థినిలు నానా అవస్థలు పడుతున్నారు. స్వీపర్ లేకపోవడంతో వారంలో ఒకరోజు విద్యార్థులు శుభ్రం చేసుకుంటున్నారు. ముఖ్యంగా వసతి గృహంలో తాగునీటి సమస్య విద్యార్థినులను వేధిస్తోంది. ఆర్ఒ వాటర్ ఏర్పాటు చేయాలని సంక్షేమ అధికారులను విద్యార్థినిలు కోరుతున్నారు. హాస్టల్ శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థినిలు ఆందోళన గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని, మౌలిక వసతులు కల్పించాలని, వసతి గృహం పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంక్షేమాధికారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బాలికలు బట్టలు ఉతికే ప్రాంతంలో పెరిగిన పిచ్చి మొక్కలు


నాచు పట్టి ఉన్న బాలికల మరుగుదొడ్లు ఇవే..

మంత్రి కొండపల్లిపై ఆరోపణల్లో వాస్తం లేదు


ప్రజాశక్తి - బొండపల్లి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒత్తిడి మేరకే మొబైల్ బుక్ కీపర్‌లను మారుస్తున్నారని ఎంపిపి చల్ల చలంనాయుడు ఆరోపించడంలో వాస్తవం లేదని టిడిపి మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ, సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, నంబూరి రాజేష్ అన్నారు. ఆదివారం మండల సముదాయం వద్ద వారు విలేఖరులతో మాట్లాడుతూ వెలుగు పథకం ఆడిట్‌లో ఆయా గ్రామాలలో జరిగిన ఎస్‌హెచ్‌జి కార్యక్రమాలలో లోపాలు కారణంగా మొబైల్ బుక్ కీపర్‌లను అధికారులు మార్పు చేశారన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య జోక్యంతోనే మొబైల్ బుక్ కీపర్‌లను మార్చిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టారని, అలాంటి వ్యక్తి పై బురద చల్లడం మానుకోవాలని హితవుపలికారు. వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీనియర్ టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ తాడ్డి అప్పలనాయుడు, బొడ్డు ఉమామహేశ్వరరావు, కునుకు నారాయనప్పుడు, పెండ్యాల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారానికి అక్రమ విద్యుత్

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని కొమిరి గ్రామంలో కోళ్ల ఫారం (పౌల్ట్రీ)కి అక్రమంగా విద్యుత్తు సరఫరా చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ గ్రామానికి చెందిన నిడగంట్ల రాంబాబు కోళ్ల పౌల్ట్రీ నిర్వహిస్తూ రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా విద్యుత్‌ను చోరీ చేస్తున్నట్లు తెలిస్తోంది. స్థానిక లైన్‌మేన్ వాసు ఇటీవల విషయం తెలుసుకొని అక్రమ విద్యుత్ చోరీని సంబంధించి తీగలను కట్ చేయగా, యధాస్థితిలో మరల నిర్వాహకుడు అక్రమ విద్యుత్తు చోరీకి పాల్పడడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి విద్యుత్తు చోరీకి పాల్పడిన వ్యక్తి నుంచి రికవరీ చేయాలని కోరుతున్నారు. బాధ్యులైన వారిపై కేసులు పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇలాంటి దుశ్చర్య మరో వ్యక్తి చేయకుండా చూడాలని చెబుతున్నారు


అక్రమ విద్యుత్తు కనెక్షన్ ఇదే..

క్రీడల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికలు వసతి గృహం విద్యార్థినులు క్రీడల్లో రాణించారు. జిల్లా కేంద్రంలో విజ్జి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన క్రీడల్లో పాల్గొన్న పది మంది క్రీడాకారులు తమ సత్తాను చాటారు. డి.శిరీష జావిలియన్ త్రో, రేవతి, సౌమ్య, సుజాత, రూప ప్రణీత 600 మీటర్ల పరుగు, కీర్తి వాక్ రేసులో, గౌరీ లాంగ్ జంప్- బ్లాక్‌త్రో, కృష్ణవేణి డిస్క్‌త్రో, రూప ప్రణీత షార్ట్ పుట్ పోటీలలో పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ఉషారాణి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరిగిన వివిధ క్రీడల్లో పాల్గొని తమ విద్యార్థినులు సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. పిఇటి అరుణ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు, నృత్య ప్రదర్శనలోనూ ప్రత్యేకంగా వసతి గృహంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

మిగులు సీట్లకు అడ్మిషన్లు

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మిగులు సీట్ల భర్తీకి అడ్మిషన్స్ ప్రారంభిస్తున్నామని ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. 2024 -2025 సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ ఈ నెల 30 తేదీతో ముగుస్తుందన్నారు. 5వ తరగతిలో 34 సీట్లు, 6వ తరగతిలో 8, 7వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 14 సీట్లు, 9వ తరగతిలో 13 సీట్లు ఖాళీలున్నాయన్నారు. అడ్మిషన్ కోసం ఈనెల 30వ తేదీన వసతి గృహానికి నేరుగా విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, కలర్ పాస్ ఫొటోస్ 5 తీసుకొని రావాలన్నారు. ప్రవేశాలకు ఎస్సి, ఎస్‌టి విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


క్రీడల్లో పాల్గొన్న బాలికలతో ప్రిన్సిపల్ ఉషారాణి

జ్యూట్ కార్మికులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - రాజాం

వస్త్రపురి కాలనీలో వాసవి జ్యూట్ కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు భవిరి కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు, ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ వాసవి యాజమాన్యాన్ని కోరారు. ఆదివారం కాలనీ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి పడి ఉన్న పిఎఫ్ తదితర మొత్తాలను వెంటనే కార్మికులకు చెల్లించాలన్నారు. జిఎంఆర్ కాలంలో సుమారు 400 మంది కార్మికులు పని చేసేవారని, నేడు ఆ కార్మికుల పరిస్థితి అత్యంత దయానీయంగా ఉందని, పెన్షన్ రాక పిఎఫ్ సెటిల్మెంట్ డబ్బులు రాక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో జబ్బులతో మంచాన పడి ఉన్నారని చెప్పారు. జిఎంఆర్ యాజమాన్యం వెంటనే కలగజేసుకొని కార్మికులకు రావలసిన అన్ని రకాల బకాయిలు యాజమాన్యం వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు రాజాం ప్రాంతం నాయకులు పి.విశ్వనాథం, ఎం.త్రినాధ్ కార్మికులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు తమ్మినేని

గూడెపువలస మాజీ సర్పంచ్ డిఎల్‌రెడ్డి మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని గూడెపువలస మాజీ సర్పంచ్ దారపు లక్ష్మణరెడ్డి శనివారం రాత్రి విశాఖలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. గత కొన్ని రోజుల నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎప్పటిలాగే ఆసుపత్రికి తరలించారు. అక్కడ అనారోగ్యం విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈయన టిడిపిలో ఉంటూ గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం వైసిపిలో చేరి మండల పార్టీ కన్వీనర్‌గా పనిచేశారు. ఇటీవలి ఎన్నికల ముందు జనసేన పార్టీలో చేరి కొనసాగుతున్నారు. టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి బి ప్రభాకర్ రెడ్డి, జనసేన పార్టీ నాయకులు మట్ట అయ్యప్ప రెడ్డి, రవణారెడ్డి, కొల్లి రామ్మూర్తి, ఎంపిటిసి కోరాడ పద్మ తదితరులు ఆయన మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డిఎల్ రెడ్డి మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న మూడు మండలాలకు చెందిన జనసేన, వైసిపి, టిడిపి నాయకులు సిరపు గురునాథరెడ్డి, పిడుగు తోటరావు, కోరాడ తాతారావు, నీలాపు అప్పలరామిరెడ్డి, దల్లి శ్రీనివాసరావు, ఎ.పైడినాయుడు, న్యాయవాది సుధాకర్, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున చేరుకుని నివాళులు అర్పించారు. జనసేన నాయకులు కాకర్ల పూడి శ్రీనివాస్ రాజు ఫోన్లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.


డిఎల్ రెడ్డి (ఫైల్)

ఉత్సాహంగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో రింగ్ రోడ్‌లో గల ఫైర్ చెస్ స్కూల్‌లో జిల్లా స్థాయి అండర్-9 బాల, బాలికల చెస్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. బాలికల విభాగంలో బి. జశ్విక (ప్రథమ బహుమతి), జి. ఖ్యాతిశ్రీ (ద్వితీయ బహుమతి), బాలుర విభాగంలో బి. అభినవ్ (ప్రథమ బహుమతి) ఆర్. హేమనాగ హర్షిత్ (ద్వితీయ బహుమతి) గెలుపొందారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెప్టెంబర్ 21,22 తేదీలలో విజయనగరంలో జరగనున్న రాష్ట్ర స్థాయిపోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి. జ్వాలా ముఖి, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.గణేష్ నాయుడు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజ్జీ స్టేడియంలో ఆదివారం సీనియర్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు, 40వ రాష్ట్రస్థాయి సీనియర్ త్వైక్వాండో పోటీలకు ఎంపిక పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయి పోటీలకు 21 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో 50మంది పాల్గొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ విజేతలు ఈనెల 31, సెప్టెంబర్ 1 వరకు చిత్తూరు జిల్లా తిరుపతిలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డివి చారి తెలిపారు.


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు